## మన ఆచారములు - అంతరార్థములు

- నిత్యానంద్.

### బ్రహ్మార్పణమంటే?

- నూనె పోసి, వత్తిని చేసి, దీపాన్ని వెలిగించి, బయటి దీపాన్ని వెలిగించే భక్తులు - జ్ఞాన దీపాన్ని వెలిగించి, తనలోని ఆ భగవంతుని గుర్తించరేమి?
- లేత పూవులను కోసి దేవుని విగ్రహముల చెంత నుంచి పూజిస్తున్నామనుకునే భక్తులు - తన హృదయమనే పుష్పాన్ని అంతరంగికుడైన ఆ దేవదేవునికి సమర్పించరేమి?
- చుట్టూ ఉన్నవారిలోని లోపాలను గమనిస్తూ, శోధిస్తూ, వారిని సాధిస్తారేగాని - తనలోనే దాగి ఉన్న అరి (షట్) వర్గాన్ని అరికట్టరేమి?
- బాహ్య ప్రపంచములో సుగంధభరితములైన ద్రవ్యాలు, ధూపములు భగవంతుని సేవకులమనుకునే వారు సమర్పిస్తారే గాని -ప్రేమ, ఆదరణ వంటి ఉత్తమమైన దివ్య పరిమళాలను వెదజల్లరేమి?
- ఎన్నో ఫలములతో, భోజ్యములతో స్వామికి నైవేద్యమును సమర్పించే భక్త కోటి - వారు ఆచరిస్తున్న పనులవలన కలిగిన ఫలమును ఆ పరమాత్మునికే సమర్పించరేమి?

**అదే కదా బ్రహ్మార్పణ మంటే!**

లేకపోతే -

- ఈ సృష్టికే వెలుగునిచ్చే దేవునిముందు దీపము వెలిగించడమెందుకు? దివిటీ ముందు మినుగురుపురుగులాగ.
- అత్యంతమనోహరమైన సృష్టిని రచించిన వానికి, ఆయన సృష్టిలోనే రెండు పువ్వులను తిరిగి సమర్పించడం ఎందుకు? కుభేరునికి అప్పు ఇచ్చినట్లు!
- సర్వమూ నిండియున్న విశ్వకర్త, విశ్వభర్త అయిన ఆయనకు మనము ఇచ్చేదేమున్నది? మనను మనము సమర్పించుకోడం తప్ప!
- జగద్వంద్యుడైన 'శ్రీ'వల్లభునికి మన కోరికల గురించి మొర పెట్టుకోనేల? మనకేది సముచితమో ఆయనకు తెలియదా! ఇవన్నీ - విశ్వకర్మకు దిశలను గురించి చెప్పినట్లు! హనుమంతుని ముందు కుప్పిగెంతులు వేసినట్లు కాదా!

మన జీవితాలను ఫలవంతం చేస్తున్న ఆ నారాయణునికి మనమిచ్చేది ఈ ఫలము, పుష్పము, తోయము కాదేమో!

- నిర్మలమైన, నిష్కల్మషమైన, నిలకడైన మన హృదయ కుసుమము,
- ఆర్ద్రత నిండిన హృదయముతో కృతజ్ఞతాపూర్వకముగా కళ్ళనుండి జాలువారే రెండు నీటి బొట్లు,
- చేస్తున్న ప్రతి పనిని నిస్వార్థమైన భక్తితో చేస్తూ - ఫలితమనే ఫలమును ఇచ్చి చూద్దాం!

***సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు!***